లేపాక్షిలో హీరో శ్రీకాంత్ దంపతులు

ప్రజాశక్తి-లేపాక్షి

లేపాక్షి దర్గా పాపన్నేశ్వర స్వామి ఆలయాన్ని ప్రముఖ సినీ హీరో శ్రీకాంత్, ఆయన భార్య ఊహ సందర్శించారు. మంగళవారం ఉదయం వారు ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. లేపాక్షి శిల్ప కళావైభవాన్ని తిలకించారు. ఆలయ అర్చకులు ఆలయ విశిష్టతను తెలియజేశారు. శాలువాతో సత్కారించి, నంది విగ్రహ జ్ఞాపికను అందచేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ లేపాక్షి ఆలయంలో శిల్ప కళాసంపద అద్భుతంగా ఉందన్నారు. అబ్బురపరిచేలా ఇక్కడ కట్టాడాలు ఉన్నాయ్నారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న హీరో శ్రీకాంత్,ఊహ

మాట నిలుపుకోని మనవడు..!

◆ బిటిపి ఎత్తిపోతలకు 60 రోజుల్లో భూసేకరణ హామీ

◆ నాలుగేళ్లు అయిన కదలిక శూన్యం ◆ పేరూరు ఎత్తిపోతల భూసేకరణ అంతే

◆ అటకెక్కిన ఆంజినేయస్వామి ప్రాజెక్టు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఈ జిల్లా మనువడు అయిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలుపుకోలేదు. జిల్లాకు ముఖ్యమంత్రి హోదాలో వివిధ సందర్భాల్లో విచ్చేసిన సమయంలో ముఖ్యమైన హామీలు కొన్నింటిని ఆయన ఇచ్చారు. అయితే ఆ హామీలు ఇంత వరకు అమలుకు నోచుకోలేదు. వీటి సంగతి ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యింది. ప్రధానంగా సాగునీటికి సంబంధించి రెండు హామీలిచ్చారు. అవి ఒక్క అడుగూ ముందుకు పడకపోవడం గమనార్హం.

60 రోజుల్లో భూసేకరణ పూర్తి అని హామీ...

2021 జులై 8వ తేదీన జిల్లాలోని రాయదుర్గం మండలంలో జరిగిన రైతు దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు జగన్మోహన్‌రెడ్డి విచ్చేశారు. ఈ సమయంలో రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి అభ్యర్థన మేరకు ముఖ్యమంత్రి కళ్యాణదుర్గం, రాయదుర్గంకు హంద్రీనీవా నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా భైరవానితిప్ప ప్రాజెక్టుకు నీటిని అందించే పనులను చేపడతామని హామీనిచ్చారు. అంతేకాకుండా ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ 1400 ఎకరాలను 60 రోజుల్లోపు పూర్తి చేస్తామని చెప్పడమే కాకుండా యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టు పూర్తి చేస్తామని హామీనిచ్చారు. స్వయంగా తానే పర్యవేక్షిస్తానని చెప్పారు. ఉంతకల్లు వద్ద చేపడుతున్న ఆంజినేయ స్వామి ప్రాజెక్టును చేపడతామని హామీనిచ్చారు. హంద్రీనీవా కింద 36వ ప్యాకేజీని పూర్తి చేస్తామని హామీనిచ్చారు. అయితే వీటిల్లో ఏ ఒక్కటీ ఇంత వరకు అమలుకు నోచుకోలేదు. కనీసం భూసేకరణ కూడా పూర్తవలేదు.

అమలుకు నోచని పేరూరు ఎత్తిపోతల హామీ

జీడిపల్లి నుంచి దేవరకొండ, తోపుదుర్తి, ముట్టాల రిజర్వాయరుతోపాటు పేరూరు ఎత్తిపోతల పథకాన్ని రెండేళ్లలో యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేస్తామని 2022 జులై 14వ తేదీన సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలో జరిగిన పంటలబీమా పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి హామీనిచ్చారు. పేరూరు ఎత్తిపోతల పథకం నిర్మాణానికి అవసరమైన భూసేకరణ వెంటనే పూర్తి చేస్తామని హామీనిచ్చారు. రెండు సంవత్సరాల కాలంలోనే ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తామని హామీని ఇచ్చారు. అయితే ఈ పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. భూసేకరణ పనులు ముందుకు సాగలేదు.

ఆరు వేల క్యూసెక్కులకు హంద్రీనీవా పెంచుతామన్నారు...

'ఇప్పుడున్న హంద్రీనీవా కాలువలో 2200 క్యూసెక్కులు మాత్రమే నీరు ప్రవహిస్తోంది. దీన్ని ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతాం. దీనితోపాటు అదనంగా ఈ కాలువకు సమాంతరంగా మరో కాలువను నిర్మిస్తాం'. అని 2019వ సంవత్సరం అక్టోబరు 10వ తేదీన అనంతపురం నగరంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న సమయంలో మాటనిచ్చారు. ఈ జిల్లాకు మనువడిని.. ఈ జిల్లా పరిస్థితుల పట్ల తనకు స్పష్టమైన అవగాహనుంది అని కూడా చెప్పారు. కానీ ఆచరణలో ఆ పనులు ముందుకు సాగలేదు.

మూడు పర్యటనలు.. మూడు హామీలు..

ముఖ్యమంత్రి ఉమ్మడి అనంతపురం జిల్లాలో మూడు సార్లు పర్యటించారు. ఈ సమయాల్లో జిల్లాకు సంబందించిన ప్రధానమైన మూడు హామీల్లో ఒక్కటీ పూర్తవలేదు. సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి జిల్లాలో రోజురోజుకు తీసికట్టుగా మారుతోంది. అయితే ఈ మూడు సంవత్సరాల్లో ప్రకృతి సహకారంతో మంచి వర్షాలు పడటంతో నీటి సమస్య ఉత్పన్నమవలేదు. వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉంటే పరిస్థితి మరో విధంగా ఉండేదన్న అభిప్రాయం రైతు సంఘాల నుంచి వ్యక్తమవుతోంది. జిల్లాకు ప్రధాన సాగునీటి వనరైన తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ దయనీయ స్థితికి చేరింది. ఏ సమయంలో ఎక్కడ గండిపడుతుందోనన్న ఆందోళన జలవనరుల శాఖ అధికారుల్లో సైతముంది. యుద్ధ ప్రాతిపదికన ఈ కాలువ ఆధునీకరణ చేపట్టాల్సి ఉంది. అయితే ఈ పనులను గడిచిన నాలుగేళ్లుగా నిధుల కేటాయింపుల్లేవు. దీంతో రెండేళ్లుగా అధికంగా నీటిని తీసుకునే అవకాశమున్నా కాలువలు పటిష్టంగా లేకపోవడంతో తక్కువ నీటినే తుంగభద్ర డ్యామ్ నుంచి తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇప్పటికైనా ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి దుర్భిక్ష ప్రాంతంగానున్న అనంతపురం జిల్లా సాగునీటి రంగానికి ప్రాధాన్యత కల్పించాలని జిల్లా రైతాంగం వేడుకుంటున్నారు. ఈ రకంగా నిధులు కేటాయించి జిల్లా మనువడిగా సహకారం అందిస్తారని ఆశిస్తున్నారు.

ప్రచారభేరి బహిరంగ సభలో ప్రసంగిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

మోడీ పాలనలో ప్రజాధనం లూటీ

◆ అంబానీ, ఆదానీలకే దేశసంపద ధారాదత్తం

◆ ఈ ప్రభుత్వాన్ని సాగనంపాల్సిందే...

◆ ప్రచార భేరి బహిరంగసభలో సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

దేశంలో తొమ్మిదేళ్ల నరేంద్ర మోడీ పాలనలో అంబానీ, ఆదానీలకు దేశ సంపదను ధారాదత్తం చేస్తూ, ప్రజాధనం మొత్తాన్ని లూటీ చేస్తున్నారని సిపిఎం, సిపిఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల ప్రారంభం నుంచి ప్రచారభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం నాడు ధర్మవరం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్లో ప్రచారభేరి– బహిరంగసభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్రకార్యదర్శి కె.రామక్రిష్ణ, సిపిఎం శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారి చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయివేటు పరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదానీ, అంబానీలకు ప్రజాధనాన్ని అప్పజెప్పారన్నారు. రూ.400 ఉన్న గ్యాస్ ధర నేడు రూ.1200కు చేరిందంటే బిజెపి పాల ఎలా సాగుతుందో అర్థం చేసుకోవచ్చన్నారు. ధర్మవరం లాంటి ప్రాంతంలో చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోవడానికి కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమని మండిపడ్డారు. రాష్ట్రానికి బిజెపి చేస్తున్న అన్యాయంపై ప్రశ్నించాల్సిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మౌనంగా ఉండడం సరికాదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రజా వ్యతిరక పాలన సాగిస్తోందన్నారు. ప్రజలపై భారాలు వేస్తూ నడ్డివిరుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచేసిందన్నారు. బిజెపి అధికారంలోకి రాకముందు రూ.450 ఉన్న సిలిండర్ ధర ఇప్పుడు రూ.1200లకుపైగా ఉందని గుర్తు చేశారు. పెట్రోల్ కూడా లీటరు రూ.45 నుంచి రూ.110లకుపైగా పెరిగిందన్నారు. ఇంకోవైపు ఆదానీ వంటి సంస్థలకు లాభాలు చేకూర్చడంలో భాగంగా విద్యుత్ ఛార్జీల భారాలు పడుతున్నాయని పేర్కొన్నారు. పేదల ఆదాయాలు ఒకవైపు పడిపోతుంటే కార్పొరేట్ సంస్థల ఆదాయం గణనీయంగా పెరుగుతోందని చెప్పారు. ఒక్క ఆదానీ ఆదాయమే రూ.50 వేల కోట్ల నుంచి రూ.16 లక్షల కోట్లకు పెరిగిందని గుర్తుచేశారు. తెలుగు ప్రజలందరూ పోరాడి 32మంది ప్రాణాలు అర్పించి సాధించుకున్న విశాఖ ఉక్కు వంటి ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుపరం చేయాలని చూస్తోందన్నారు. ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీయడంలో భాగంగా మతత్వాన్ని పెంచిపోషిస్తోందని విమర్శించారు. ప్రజా వ్యతిరక పాలన సాగిస్తున్న బిజెపి వచ్చే ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజియులు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి జింకా చలపతి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, సీపీఎం పట్టణ కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటమయ్య, రైతుసంఘం జిల్లా కార్యదర్శి జెవి.రమణ, సిఐటియు జిల్లా నాయకులు ఎస్‌హెచ్.బాషా, అయూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

◆ నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు ◆ కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివద్ధి పథంలో నడిపించాలని, విధులపై నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని కలెక్టర్ అరుణ్‌బాబు హెచ్చరించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్‌ఒ కొండయ్య, డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవానీశంకర్, ఆర్డీవోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్డీవోలు, తహశీల్దార్లు అభివద్ధి పనులపై సమీక్ష నిర్వహించాలన్నారు. అధికారులు అందరూ శ్రద్ధ పెట్టి పని చేయాలన్నారు. రెవెన్యూ, గహ నిర్మాణం, ఐసిడిఎస్, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, ఉపాధి హామీ తదితర అభివద్ధి పనులను అధికారులందరూ సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చినా, సంబంధిత హెచ్‌ఒడిలతో సంప్రదించి పరిష్కరించాలన్నారు. భూసర్వే పనులు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. భూ వివాదాలను పరిష్కరించడమనేది సర్వే ప్రధాన ఉద్దేశమన్నారు. రీ సర్వే పక్కాగా చేయకపోతే రెండవసారి చేయాల్సి వస్తుందన్నారు. ఆధునిక పరిజ్ఞానంతో చేపట్టిన రీ సర్వే పూర్తి అయిన గ్రామాల్లో రాళ్ల నాటే కార్యక్రమం వేగవంతం చేయాలన్నారు. మొదటి సర్వే బాగా చేశారని రెండవ దశ రీ సర్వే కూడా బాధ్యతగా చేయాలన్నారు. మే 5వ తేదీకి రాళ్ల పాతి పెట్టె పనులు పూర్తి చేయాలన్నారు. వసతి గహాల్లో పిల్లల ఆరోగ్యం పట్ల సాంఘిక సంక్షేమ శాఖ డిడిలు పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రాధాన్యత భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రస్తుతం ఉపాధి కూలీలు 65 వేల మంది కూలీలు పనిచేస్తున్నారని, ఆ సంఖ్య లక్షకు చేరుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అంగనవాడీ కేంద్రాలను సిడిపిఒలు, సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలన్నారు. నాడు-నేడు పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు భాగ్యరేఖ, తిప్పేంద్ర నాయక్, సిపిఒ విజయ్ కుమార్, గహ నిర్మాణ శాఖ పీడీ చంద్రమౌళి రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రషీద్ ఖాన్, డిపిఒ విజయ్ కుమార్ రెడ్డి, డిఎంహెచ్‌ఒ కష్ణారెడ్డి, డిఈఒ మీనాక్షి, భూమి సర్వే ఏడీ రామకష్ణ, డ్వామా పీడీ రామాంజనేయులు, సాంఘిక సంక్షేమ డిడి శివరంగ ప్రసాద్, పిఆర్ ఎస్‌ఇ గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

పాతర్లపల్లిలో 'ఇదేమి ఖర్మ' రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

తిరుగుబాటు మొదలైంది..

రొద్దం : రాష్ట్రంలో రాక్షస పాలనపై తిరుగుబాటు మొదలైందని టిడిపి నాయకులు పేర్కొన్నారు. మండల పరిధిలోని పాతర్లపల్లి గ్రామంలో మంగళవారం 'ఇదేమి ఖర్మ' రాష్ట్రానికి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో చిన్నా పెద్దా, ఆడ, మగ తేడా లేకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ రాక్షస పాలన సాగిస్తున్నారన్నారు. దీంతో ప్రజలు ప్రభుత్వం, అధికార పార్టీ నాయకులపై తిరగబాటుకు సిద్ధమయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగేంద్ర, పెనుకొండ నియోజకవర్గ ఉపాధ్యక్షురాలు లీలావతి, టిడిపి నాయకులు నాగరాజు, చల్లా శరత్, టిఎన్‌టియుసి అధ్యక్షుడు మురళి, పోతన్న, ఉప్పర రామకష్ణ, ఉప్పర మోహన, శివ, చాకలి హనుమంతు, రమేష, రవి, రామంజి, ఉప్పర రామాంజి పాల్గొన్నారు.

నియోజకవర్గంలో అభివృద్ధి చేసిందెవరో ప్రజలకు తెలుసు

టిడిపి జిల్లా అధ్యక్షుడు బికె.పార్థసారథి

ప్రజాశక్తి -పెనుకొండ

పెనుకొండ నియోజకవర్గాన్ని అభివద్ధి చేసిందెవరో ప్రజలందరికీ తెలుసని టిడిపి జిల్లా అధ్యక్షుడు బి.కె. పార్థసారధి పేర్కొన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం లో మంగళవారం ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి హయాంలో జరిగిన అభివద్ధి,పెనుకొండ నియోజకవర్గంలో ఎవరు అభివద్ధి చేశారో ప్రజలకు బాగా తెలుసన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టలేని అభివద్ధి చేయలేని అసమర్థుడు ఎమ్మెల్యే శంకర నారాయణ అని విమర్శించారు. 'కియా కార్ల' పరిశ్రమను తెచ్చిన ఘనత నారా చంద్రబాబు నాయుడుదని గుర్తు చేశారు. గతంలో ప్రతిపక్ష నేతగా మీ అధినేత జగన్ బెంగళూరు వెళ్తూ మార్గమధ్యలో కియా పరిశ్రమ వద్ద ఆపి కియా పరిశ్రమ రాదు, టిడిపి మిమ్మల్ని మోసం చేసి భూములు తీసుకొందని, వైసిపి ప్రభుత్వం రాగానే భూములను రైతులకు తిరిగి ఇచ్చేస్తామని చెప్పిన మాటలు మీకు గుర్తు లేవా అని శంకర నారాయణను ప్రశ్నించారు. కియా పరిశ్రమను వైఎస్ తెచ్చారు అనడం సిగ్గుమాలిన చర్య అన్నారు. గతంలో గొల్లపల్లి రిజర్వాయర్‌కు వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంజూరు చేసిన నిధులను అప్పటి కాంట్రాక్టర్లు నొక్కేసి పనులను పూర్తి చేయకుండా వదిలివేయగా 2014లో టిడిపి అధికారంలోకి రాగానే 18 నెలల్లోనే గొల్లపల్లి రిజర్వాయర్ పనులను వంద శాతం పూర్తి చేసి, కష్ణా జలాలను రాయలసీమకు తీసుకొచ్చిన మహోన్నత వ్యక్తి, అపర భగీరథుడు నారా చంద్రబాబునాయుడు అన్నారు. గతంలో పెనుకొండ అంబేద్కర్ కూడలిలో చర్చకు రమ్మని సవాల్ విసిరినా 'నీ దగ్గర ఆధారాలు లేక చర్చకు రాలేని పిరికిపందవు నువ్వు.. నువ్వా మా నాయకుడి గురించి మాట్లాడేది.. తస్మాత్ జాగ్రత్త' అని ఎమ్మెల్యే శంకర నారాయణను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర రైతు కార్యనిర్వాహక కార్యదర్శి జీవీపీ నాయుడు, నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడు చిన్నప్పయ్య, సర్పంచి శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి రఘువీర చౌదరి, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఈసి హరీష్, రొద్దం మండల ప్రధాన కార్యదర్శి మురళి, సానిపల్లి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులతో మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు బికె

నిబంధనలు పాటించకుండా ఇసుక తరలిస్తే ఊరుకోం..

ప్రజాశక్తి-పరిగి

నిబంధనలను అతిక్రమించి ఇసుక తరలిస్తే ఊరుకోమని, వెంటనే రీచ్‌ను నిలుపుదల చేయాలని పరిగి మండల వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. పరిగి జయమంగళ నదిలోని రీచ్ నుంచి నెల రోజులుగా నిబంధనలను అతిక్రమించి ఇచ్చిన సర్వే నంబర్ కాకుండా మరో సర్వే నంబర్ లో ఇసుకను తరలించడం సరైన విధానం కాదని, వెంటనే ఇసుక తరలింపును ఆపాలని కోరారు. సంబంధిత అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి కొలతల పూర్వకంగా కానీ, నిబంధనలకు అనుగుణంగా కానీ మార్గదర్శకాలు ఇచ్చి ఇసుక తరలింపునకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అంతవరకూ జెసిబి, టిప్పర్లు జయమంగళ నదిలోకి రాకూడదని వస్తే ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. అలాగే రీచ్‌లో ఇసుక నింపుతున్న టిప్పర్లు, హిటాచిలను అడ్డుకొన్నారు. వారిలో వైసిపి నాయకులు ప్రభాకర్, మంజునాథ్ రెడ్డి, శివశంకర్, చంద్రశేఖర్, నర్సింహారెడ్డి, చిక్కన్న, మారుతి రెడ్డి ఉన్నారు.

ఇసుక రీచ్‌ను నిలుపుదల చేస్తున్న వైసీపీ నాయకులు

బిజెపి ప్రజావ్యతిరేక పాలనపై సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచారం చేస్తున్న దృశ్యం

మోడీని గద్దె దింపుదాం

ప్రజాశక్తి-కనగానపల్లి

మండల పరిధిలోని మామిళ్లపల్లి గ్రామంలో మంగళవారం సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో 'దేశ సంపదను సంపన్నులకు దోచి పెడుతున్న మోడీని గద్దె దింపి దేశాన్ని కాపాడుకొందాం' అని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జేవీ రమణ, బత్తల కదిరప్ప, సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు కాటమయ్య, బ్యాళ్ల మహాదేవ బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకూ సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 'మోడీ హటావో-దేశ్ బచావో' పేరుతో ప్రచారభేరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ నిరంకుశ ధోరణితో వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందని మండిపడ్డారు. ప్రజల్లో కులతత్వం, వతతుతోన్మాదాన్ని రెచ్చగొడుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బాలరాజు, వడ్ల గోవిందు, ముత్యాలు, ఈశ్వరయ్య, మహానంద, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-లేపాక్షి

సత్యసాయి ఆరాధనోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక సత్యసాయి భజన మందిరం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అందులో 17 మంది భక్తులు రక్తదానం చేయగా వారికి పండ్లు అందజేశారు. శిబిరంలో ప్రభుత్వాస్పత్రి సిబ్బంది, భజన మందిరం సభ్యులు పాల్గొన్నారు

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శంకర నారాయణ, వైసిపి నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-గోరంట్ల

రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు పంపిణీ చేస్తోందని పెనుగొండ శాసనసభ్యులు శంకర నారాయణ తెలిపారు. మండల పరిధిలోని గొల్లపల్లి, బిఎన్ తండా, బోయలపల్లి, బత్తలపల్లి గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రమీలమూర్తి, జడ్పిటిసి జయరాం నాయక్, వైస్ ఎంపీపీ నాగభూషణ్ రెడ్డి, సీనియర్ వైసిపి నాయకులు శంకర్ నాయక్, కన్వీనర్ లక్ష్మీనరసప్ప, తదితరులు పాల్గొన్నారు

సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఉద్యమం : జెఎసి

ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్. వెంకటేష్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేంతవరకు ఉద్యమం వివిధ రూపాల్లో కొనసాగిస్తామని ఉద్యోగ ఐకాస అమరావతి సంఘం సభ్యులు, సిఐటియు శ్రీ సత్య సాయి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ అన్నారు. ఏపి జెసి అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం ముందు మంగళవారం తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి ఉద్యోగ సంఘం నాయకులు పిలుపుమేర సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం జీవో నెంబర్ ఒకటి తెచ్చి ఉద్యమాలను, సభలను నిర్వహించకుండా నిరోధిస్తోందని, ఎక్కడో మూలన పడ్డ బ్రిటిష్ కాలం నాటి జీవోను ఇప్పుడు ఉద్యోగస్తులపైన, ఉద్యమ కారుల పైన రుద్దుతున్నారని విమర్శించారు. దీనిని అడ్డం పెట్టుకొని పోలీసులు రోడ్లపైకి వచ్చే ఉద్యమ కారుల సభలను సమావేశాలను నిరోధిస్తున్నారని ఇలాంటి జీవోలను రద్దు చేసేంతవరకు పోరాటం చేయాలని తెలిపారు. ఉద్యోగస్తుల న్యాయమైన సమస్యలను పరిష్కారం చూపాలని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ,ఉద్యోగులకు ఒకటవ తారీఖున వేతనాలు, పెన్షన్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలని 12వ పేరివిజన్ కమిషన్ వెంటనే నియమించాలని కోరారు. ఉద్యోగులకు లేని పెన్షన్ రాజకీయ నాయకులు ఎందుకని వారు ప్రశ్నించారు. కొత్త జిల్లాలో 16 శాతం హెచ్ఆర్ఏ ఇవ్వాలని పెండింగ్లో ఉన్న డిఎలను వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఎపి జెసి చేపడుతున్న పోరాటంలో ప్రజా సంఘాలు హక్కుల సాధన కోసం కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి బయన్న, ఎపి జెసి ఛైర్మన్ మైనుద్దీన్, ఏపీ జెసి సెక్రటరీ పద్మనాభరావు, ఆర్టీసీ డిపో అధ్యక్షులు నాగార్జున రెడ్డి, ఏపీ మున్సిపల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహులు, గ్రామ వార్డు సచివాలయ అధ్యక్షులు చౌడప్ప, జిల్లా అంధుల నిరీక్షణ సంఘం అధ్యక్షులు గంగన్న తదితరులు పాల్గొన్నారు.

7న ఉచిత కంటివైద్యశిబిరం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని బాలుర ఉన్నతపాఠశాలలో మే 7న యువర్స్ ఫౌండేషన్ సౌజన్యంతో ఉచితకంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్టు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు వైకె శ్రీనివాసులు, కార్యదర్శి సుంకు సుకుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు స్వాతి క్లీనిక్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కంటి వైద్యశిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడుదలచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యువర్స్ ఫౌండేషన్ సౌజన్యంతో కర్నూల్‌కు చెందిన శ్రీచక్ర ఆస్పత్రివారిచే కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నామన్నారు. క్యాంప్‌చైర్మన్‌గా చాంద్‌బాషా వ్యవహరించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కోశాధికారి రాధాక్రిష్ణ, సభ్యులు డాక్టర్ సుబ్బారావు, క్యాంప్ చైర్మన్ శీలానాగేంద్ర, సభ్యులు వాసుదేవుడు, రమేష్‌బాబు, రంగం బాలాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కదిరిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఓడిసి మండలంలో పాల్గొన్న స్థానిక నాయకులు

ప్రజాశక్తి గోరంట్ల

పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామనిపెనుగొండ శాసనసభ్యులు శంకర్ నారాయణ అన్నారు. మండలంలోని గొల్లపల్లి బిఎస్ తండా, బోయలపల్లి, బత్తలపల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్‌నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రమీల మూర్తి, జెడ్పీటీసీ జయరాం నాయక్, వైస్ ఎంపిపి నాగభూషణ్ రెడ్డి, సీనియర్ నాయకులు శంకర్ నాయక్, లక్ష్మీనరసప్ప తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే పివి. సిద్ధారెడ్డి అన్నారు. మండల పరిధిలోనిరాందాస్ నాయక్ తండా, మీటే నాయక్ తండా, బొడే నాయక్ తండా, వై.కొత్తపల్లి, నాగూరివండ్లపల్లి, రొద్దంవారిపల్లిలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అమర్నాథ్ రెడ్డి, జడ్పీటీసీలు, వైస్ ఎంపిపీలు, కో ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : రాష్ట్రాభివృద్ధి వైసిపి ప్రభుత్వంతోనే సాధ్యమని తుమ్మలకుంట్లపల్లి సచివాలయ కన్వీనర్ చంద్ర మౌళి నాయుడు అన్నారు. మండలంలోని టిజ కుంట్లపల్లిలో మానమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు ఇంటింటికి తిరిగి వైసిపి ప్రభుత్వం చేపట్టిన పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీదేవి, ఎంపీటీసీ ప్రభాకర్ నాయుడు, డీలర్ మధుసూదన నాయుడు, పెద్ద రంగప్ప , సోషల్ మీడియా కో కన్వీనర్ అగ్గి నరసింహ, కార్యకర్తలు మనోహర్, కిష్టప్ప, రాము తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి వైసిపి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని సచివాలయాల మండల కన్వీనర్ జయరామిరెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండలంలోని అప్రాచెరువు గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని గ్రామస్తులతో కలిసి నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వ హయాంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. లబ్ధిదారుల అనుమతితో ఇంటి తలుపులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఉన్న స్టికర్‌ను అతికించారు. ఐదు ప్రశ్నలు అడిగి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు వెంకటరంగారెడ్డి. సచివాలయ కన్వీనర్ రాజు వీరారెడ్డి, మనోహర్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, బండి వీరనారప్ప, అంకె వీరనారప్ప, దివాకరరెడ్డి, వాలెంటర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తత అవసరం

పుట్టపర్తి, ధర్మవరం మండలాల్లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రజలు ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని జిల్లా వైద్యాధికారి ఎస్వీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మలేరియా దినోత్సవం సందర్భంగా పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని యనమల పల్లి గ్రామంలో మంగళ వారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లావైద్యఆరోగ్య శాఖాధికారి , జిల్లా మలేరియా అధికారి కుళ్లాయప్ప నాయక్ పాల్గొన్నారు. ప్రజలు ఆరోగ్య వంతమైన జీవనం సాగించాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. డ్రైడే ఫ్రైడే పాటించి జ్వరాల బారిన పడకుండ ఉండాలన్నారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు జ్యోత్స్న, ఫణీంద్ర సాయి, సిహెచ్ఒ నగేష్, పిహెచ్ఎన్ లలిత కుమారి, ఎఎంఒ లక్ష్మీ నాయక్, ఎస్‌యుఒ రమణయ్య, సూపర్ వైజర్లు రామ మోహన్, నాగరత్న ఎంపిహెచ్ఒలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : మలేరియా వ్యాధిపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ సాల్మాన్, ఆస్పత్రి సూపరింటెండెంట్ పద్మలత సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి వద్ద ర్యాలీని వారు ప్రారంబించారు. ఇంటిదగ్గర మురుగునీరు నిల్వ ఉండకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి జయరాంనాయక్, లక్ష్మీనారాయణ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్ఒ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మలేరియా సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రతి శుక్రవారం డ్రైడే గా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ సూర్యనారాయణ రెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : ఇంటి చుట్టూ పరిసరాల పరిశుభ్రత తో పాటు దోమల నివారణకు దోమతెరలను తప్పనిసరిగా వాడాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ ఐనుద్దిన్ సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవము సందర్భముగా ఏరియా హాస్పిటల్ నందు మలేరియా పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, సచివాలయ అధికారులు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్ట మరమ్మతు పనుల పరిశీలన

రైతుల విన్నపాన్ని పట్టించుకోని ప్రపంచబ్యాంకు ప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి బుక్కపట్నం

మండల పరిధిలోని గూనిపల్లి గ్రామంలో ప్రపంచబ్యాంకు నిధులతో చేపట్టిన చెరువుకట్ట మరమ్మతు పనులను ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు మంగళవారం పరిశీలించారు. ప్రపంచబ్యాంకు ప్రతినిధులు శాంతను , వెంకట, షాగున్, రంజన్ తదితరులు రూ. 83 లక్షల రూపాయల ప్రపంచ బ్యాంకు నిధులతో చేపడుతున్న చెరువు కట్ట మరమ్మతులు పనులు పరిశీలిస్తున్న సందర్భంలో గ్రామానికి చెందిన రైతులు తమ సమస్యలను వారికి విన్నవించారు. చెరువు కట్ట నిర్మాణపనులు కొంతమేర తమ పట్టా భూములలో చేపట్టారని కాంట్రాక్టర్ తమకు నష్టపరిహారం అందేలా హామీ ఇచ్చి మోసం చేశారని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. అదేవిధంగా చెరువులో నీరు నిలువ ఉండకుండా చెరువు దిగున ఉన్న హంద్రీనీవా కాలువలోకి వెళ్లిపోతుండటంతో చెరువులో నీరు లేకుండా పోతోందని, కట్ట వల్ల ప్రయోజనం లేకుండా పోతుందని రైతులు అధికారులకు వివరించారు. అయితే రైతుల సమస్యలు పట్టించుకోని అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ రాఘవయ్య, ఇరిగేషన్ ఎస్ఇ శ్రీనివాస్ రెడ్డి, ఈ ఈ నారాయణ నాయక్, వాటర్ రిసోర్స్ ఆఫీసర్ గంగాధర్, అగ్రి అడ్వైజర్ బోర్డు చైర్మన్ రమణారెడ్డి, ఇరిగేషన్ జేఈలు సుధాకర్ రాజు, జమున భాయ్, హార్టికల్చర్, అగ్రికల్చర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్థానిక అధికారులతో మాట్లాడుతున్న ప్రపంచబ్యాంకు ప్రతినిధులు

మోడల్ ఎంసెట్ విజయవంతం

ప్రజాశక్తి-హిందూపురం

భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని సప్తగిరి కళాశాలలో నిర్వహించిన మోడల్ ఎంసెట్ విజయవంతం అయింది. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, కళాశాల ఎంబిఎ ప్రిన్సిపల్ నారాయణ రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శివ శంకర్ రెడ్డి, ఎఒ గంగిరెడ్డి మోడల్ ఎంసెట్ ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థుల సమస్యలపై పోరాటాలను చేయడంతో పాటు పరీక్షల్లో ఉన్నా భయాన్ని పోగొట్టడానికి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పరీక్షలు రాయడం వల్ల విద్యార్థులకు ఎంసెట్‌పై అవగాహన వస్తుందన్నారు. బాబావలి మాట్లాడుతు రాష్ట్ర వ్యాప్తంగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. సప్తగిరి కళాశాలలో నిర్వహించిన పరీక్షలకు 500 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, హర్ష, మహేష్, భగత్, వినోద్, నిహాల్, అభి, రమేష్, హర్ష, నాగేంద్ర, నవీన్, లిఖిత్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశ్న పత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, ప్రిన్సిపల్, అధ్యాపకులు

జగన్ రెడ్డి పర్యటనను అడ్డుకుంటాం : టిడిపి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లా నార్పల పర్యటనను అడ్డుకుంటామని టీడీపీ ఎస్సీసెల్ మండల అధ్యక్షులు రేగాటిపల్లి వరదరాజులు హెచ్చరించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కొత్త పథకాలు తెస్తానని, ఎస్సీ, ఎస్టీలను అభివృద్ధి బాటలో నడిపిస్తానని ఆశలు పెట్టి ఎస్సీ, ఎస్టీలను నట్టేట ముంచారన్నారు. సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టించి ఎస్సీ,ఎస్టీలను మోసం చేశారన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

కదిరి టౌన్ : నల్లచెరువు మండలం తలమద్దివాండ్లపల్లి పంచాయతీ ఉప్పార్లపల్లి కి చెందిన యువకుడు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయం వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి తక్షణ సాయంగా రూ. 5వేలను బాధితుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, బత్తల యువసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ముదిగుబ్బ : మండలంలోని గ్రామాలలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హేమంత్‌కుమార్ హెచ్చరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడితే మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పేకాట, మట్కా, క్రికెట్ బెట్టింగ్, కోళ్ల పందాలు, నాటు సారా, కర్నాటక మద్యం తదితర చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరిపినా గొడవలు తలెత్తినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

కదిరి అర్బన్ : మండల పరిధిలోని రాచువారిపల్లి తండా కి చెందిన వైసిపి కార్యకర్త గోపాల్ నాయక్ కుమారుడు అరుణ్ తేజ్ నాయక్ కేరళలో జరిగిన ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మృతుడి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. రూ. 10వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు బాధిత కుటుంబానికి అందజేశారు.

రాష్ట్ర కమిటీకి అభినందనలు

కదిరి టౌన్ : నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీకి ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున్ రెడ్డి అభినందనలు తెలిపారు. ప్రభుత్వంలోకి విలీనం అయిన తర్వాత ప్రప్రథముగా నేషనల్ మజ్దూర్ యూనియన్‌లో ఏర్పడిన రాష్ట్ర కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు పివి.రమణారెడ్డి ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జున రెడ్డి విజయవాడ లోని ఆర్టీసీ హౌస్ లో నాయకులను పరిచయం చేసారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు హాజరయ్యారు. ప్రభుత్వంలోకి విలీనం అయిన తర్వాత ఏర్పడిన యూనియన్ నాయకులకు చైర్మేన్ మల్లికార్జున రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. నూతన కమిటి నాయకులను ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టరు ద్వారకా తిరుమల రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోటేశ్వరరావు తదితరులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమములో రాష్ట్ర నాయకులు మోహన్, రాజేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

ధర్మవరం టౌన్ : స్థానిక శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను ఈనెల 27వతేదీ నుండి మే 7వతేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దాశెట్టి సుబ్రమణ్యం, పాలకవర్గం సభ్యులు తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 27న ధ్వజారోహనంతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. 28న ఉదయం సూర్యప్రభవాహనం, సాయంత్రం చంద్రప్రభవాహనం, 29న ఉదయం సర్వభూపాల వాహనం, సాయంత్రం సింహవాహనం, 30న ఉదయం కల్పవృక్షవాహనం, సాయంత్రం హనుమద్వాహనం, మే 1న ఉదయం పుష్పమండపం, సాయంత్రం కళ్యాణోత్సవం, 2న సాయంత్రం 3గంటలకు శేషవాహనం, 6గంటలకు గజవాహనంపై చెన్నకేశవుడు ఊరేగింపు నిర్వహించడం జరుగుతుందన్నారు. 3న ఉదయం మడుగు తేరు సాయంత్రం 4గంటలకు బ్రహ్మరథోత్సవం, 6గంటలకు దూళోత్సవం ఉంటుందన్నారు. 4న సాయం త్రం 6గంటలకు అశ్వవాహనం, 5న ఉదయం పుష్పమండపం, 10గంటలకు వసంతోత్సవం, సాయంత్రం 6గంటలకు హంసవాహనం, 6న సాయంత్రం దేవతాఉద్వాసన 17న ఉదయం 9గంటలకు పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

వైశాఖ పౌర్ణమికి ప్రత్యేక బస్సు సర్వీసులు

పుట్టపర్తి అర్బన్ : వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని శివ భక్తాదులకు జిల్లాలోని అన్ని డిపోల నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రత్యేకంగా నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి మధుసూదన్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైశాఖ పౌర్ణమి మే 5న జరిగే శివ దర్శనానికి వెళ్లే వారికి జిల్లా నుంచి 20 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. మే 4న జిల్లాలోని అన్ని డిపోల నుంచి అరుణాచలం గిరి ప్రదర్శనకు బస్సులు ప్రత్యేకంగా నడుపుతున్నామన్నారు. జిల్లాలోని అన్ని డిపోల బస్టాండ్లలో ఒపిఆర్ఎస్ కౌంటర్‌లో గాని, ఎబిటి ఏజెంట్ల వద్ద గాని ముందస్తుగా టికెట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చున్నారు. మరిన్ని వివరాలకు ఆయా బస్టాండ్లలోని కౌంటర్లలో సంప్రదించవచ్చున్నారు.

ఎంఆర్‌పిఎస్ బలోపేతానికి కృషి

పుట్టపర్తి అర్బన్ : జిల్లాలో ఎంఆర్‌పిఎస్ బలోపేతానికి ప్రత్యేక కార్యక్రమం చేపట్టామని ఆసంఘం జిల్లా ఇన్‌ఛార్జి ఎంవైపి ఓబులేసు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 50 రోజుల పాటు గ్రామాలకు వెళదాం అనే కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కెపి. మధు ఆధ్వర్యంలో చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించడం, దళితులకు ఎంఆర్‌పిఎస్ కార్యాచరణ ప్రణాళికను వివరించి వారిలో చైతన్యం తేవడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. తద్వారా ఎంఆర్‌పిఎస్ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో కమిటీలు ఏర్పడ్డాయని వారందరూ 50 రోజుల పాటు గ్రామాల్లో దళితులతో కలిసి సమస్యలపై చర్చిస్తారని వివరించారు.

రెండు రోజుల పాటు ఆధార్ అప్‌డేట్ క్యాంపు

బత్తలపల్లి : మొబైల్ ఆధార్ వారోత్సవాల్లో భాగంగా రెండు రోజుల పాటు ఆధార్ అప్‌డేట్ కోసం మొబైల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో కె. శ్రీదేవి తెలిపారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో 26, 27 తేదీల్లో రెండు రోజులు పాటు ఆధార్ కార్డు అప్డేట్ చేసుకోవడానికి ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంపుల్లో ప్రజలు పాల్గొని తమ కార్డులను అప్డేట్ చేసుకోవాలన్నారు. చిన్నారులు ఉంటే వారి ఆధార్ కార్డు కూడా అప్‌డేట్ చేసుకోవాలన్నారు. 26వ తేదీన మాల్యవంతం. తంబాపురం, ఈదుల ముష్టూరు సచివాలయాల్లోనూ, 27వ తేదీన బత్తలపల్లి, తంబాపురం, ఈదుల ముష్టూరు సచివాలయాల్లో క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మే డేను జయప్రదం చేయండి

హిందూపురం : మే 1 అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో చేపట్టే ర్యాలీ, బహిరంగ సభల్లో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు పట్టణ నాయకులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం పట్టణంలోని పౌరసరఫరాల శాఖ గౌడన్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, మే డేను జయప్రదం చేయాలని కోరారు. అదే విధంగా మే డే విశిష్టత, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను మార్చి, పారిశ్రామిక వేత్తలకు కార్మికులను కట్టు బానిసలుగా మారుస్తున్న విధానాలను వివరించారు. ఈ నేపథ్యంలో మే 1న ఉదయం 10 గంటలకు ఆర్ అండ్ బి బంగ్లా నుండి జరిగే కార్మిక ప్రదర్శన, బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అనంతపురం జిల్లా నార్పల మండలంలో నిర్వహించే విద్యా దీవెన పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రానున్న తరుణంలో పుట్టపర్తి విమానాశ్రయంలో భద్రత ఏర్పాట్లను జిల్లా కలెక్టరు, ఎస్పీ ఆధ్వర్యంలో పరిశీలించారు. ముఖ్యమంత్రి 26న ఉదయం గన్నవరం నుండి ప్రత్యేక విమానంలో పుట్టపర్తి విమానశ్రయానికి 9 : 45కు చేరుకుంటారు. ఇక్కడినుండి అనంతపురం జిల్లా నార్పల మండలం బాలుర హై స్కూల్ ఆవరణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకొనున్నారు. అక్కడ సభ ముగించుకొని మధ్యాహ్నం 1:10 నార్పలలో బయలుదేరి పుట్టపర్తి విమానాశ్రయానికి 1 :30 చేరుకుంటారు. పుట్టపర్తి విమానశ్రయం నుండి 1 : 30 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరానికి తిరిగి ప్రయాణం కానున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటనకు అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. మంగళవారం పుట్టపర్తి విమానాశ్రయంలో కలెక్టర్ జిల్లా ఎస్పీ మాధవరెడ్డి కలసి పుట్టపర్తి విమానశ్రయంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యశాఖ స్పెషలిస్ట్ డాక్టర్ల ఏర్పాటు, అంబులెన్స్, సేఫ్ రూము ,ఫైర్ అధికారులు, ఫైర్ సేఫ్టీ చర్యలు ఫుడ్ సేఫ్టీ, తదితర శాఖలు తీసుకోవలసిన చర్లపై పలు సూచనలు చేశారు. విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో శుభ్రంగా ఉంచాలని పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ కు ఆదేశాలు జారీ చేశారు. కాన్వాయ అందుబాటులో ఉండే విధంగా వాహనాల సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలని ట్రాన్స్‌పోర్టు అధికారికి సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోప్ పార్టీ బందోబస్తు అంశాలపై పోలీసులకు సూచనలు చేశారు. ఎయిర్‌పోర్టు టర్మినల్ రన్వే, మొదలగు స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి రామకృష్ణప్రసాద్, ఎస్‌బిఐ డీఎస్పీ ఉమామహేశ్వర్ రెడ్డి, ఆర్డీవో భాగ్యరేఖ, తహశీల్దార్ నవీన్ కుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విమానాశ్రయ పరిసరాల్లో గట్టి బందోబస్తు : ఎస్పీ

అనంతపురం జిల్లా నార్పలలో ముఖ్యమంత్రి పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా కేంద్రం లోని విమానాశ్రయం, పరిసర ప్రాంతాలలో గట్టి భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 220 మంది తో గట్టి భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. ఒక డీఎస్పీ, నలుగురు సిఐలు, 12 మంది ఎస్ఐలు, 12 మంది ఎఎస్ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు, 125 మంది పోలీస్ కానిస్టేబుళ్లు, ఏడుగురు మహిళా పోలీసులు, 24 మంది ఎఆర్‌పిసిలు, నలుగురు స్పెషల్‌పార్టీ పోలీసులు, 35 మంది హోంగార్డులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో స్వయంగా సమీక్షించిన ఎస్పి అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో విమానాశ్రయ పరిసర ప్రాంతాలలో బుధవారం ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు.

సిఎం పర్యటనా ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్, ఎస్పీ, తదితరులు

In the court of the Senior Civil Judge:Penukonda
I.A.522/2021 in O.S. No: 59/2017
Between:
Vaddi Nagappa @ Penukonda Nagappa
Died by L.rs **...petitioners/ plaintiffs**
And
Gorantla Obulesh and others
...Respondents/Defendants
Notice to Respondent No:5
ఇందుమూలముగా నీకు తెలియజేయడం ఏమనగా పై నెంబరు దావాలోని 3వ ప్రతివాది గోరంట్ల ఓబులమ్మ చనిపోయినందున ఆమె వారసులైన మిమ్మల్ని పై దావాలో ప్రతివాదులుగా చేర్చమని ఐ.ఎ.నెం:522/2021 అర్జీని దాఖలు చేసినారు. సదరు విషయముల్లై నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల నీవు 28/04/2023 ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో ఖుద్దున గానీ వకీలు ద్వారా గానీ హాజరు అయి నీ వాదనను కోర్టు వారికి తెలుపుకొనవలెనని ,లేని యెడల నీ పరోక్షమందు సదరి అర్జీని తీర్మానం చేయుదురని యిందుమూలముగా నీకు తెలియజేయడమైనది.
(By order of the court)
ఎల్.విశ్వనాథ్, అడ్వకేట్, పెనుకొండ.